సాక్షి చిత్తూరు

ఆదివారం । 5 । నవంబర్ । 2023



పవిత్రం.. శాస్త్రోక్తం

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. - 8లో



ట్రావెల్స్ బస్సు, ఐషర్ ఢీ

ట్రావెల్స్ బస్సు, ఐషర్ వాహనం ఢీ కొని పలువురు కూలీలు గాయపడిన ఘటన వి.కోటలో జరిగింది. - 8లో



జాబ్‌మేళాలో 267 ఉద్యోగాలు

పలమనేరులో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 267 మందికి ఉద్యోగాలు లభించినట్టు గుణశేఖర్ రెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

విభిన్నప్రతిభావంతులకు గుర్తింపు కార్డు



మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాస్

చిత్తూరు కలెక్టరేట్ : విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక వైకల్యం కార్డును కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని ఆ శాఖ జిల్లా ఏడీ శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తపోవనం ఎదురుగా ఉన్న వికాస్ విహార్ స్కూల్ (రాస్) ప్రాంగణంలో విభిన్నప్రతిభావంతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏడీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందజేసే ప్రత్యేక వైకల్యం కార్డుపై విభిన్నప్రతిభావంతులకు అవగాహన ముఖ్యమన్నారు. విభిన్నప్రతిభావంతులకు కేంద్రం అందజేసే వైకల్యం గుర్తింపు కార్డును ధ్రువీకరణకు ఏకైక పత్రంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. వైకల్యం శాతాన్ని లెక్కించడానికి త్వరితగతిన అంచనా వేయడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. వైకల్యాలు ఉన్న విభిన్నప్రతిభావంతులు కార్డు కోసం www. swavlambancard. gov.in వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని విభిన్నప్రతిభావంతులు వినియోగించుకోవాలని కోరారు.

ట్రాన్స్‌కో చిత్తూరు ఇన్‌చార్జి ఈఈగా శ్రీనివాసకృష్ణమూర్తి

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో తిరుపతి ఈఈ శ్రీనివాసకృష్ణమూర్తికి చిత్తూరు ట్రాన్స్‌కో ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఉన్న ఈఈ నాగేశ్వర్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన అదనపు బాధ్యతలు ఇచ్చారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీ

– రూ.12.62 లక్షల జరిమానా

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. మొత్తం 3,366 సర్వీసులు తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ పరిధిలో 127, తిరుపతి రూరల్ 48, పుత్తూరు 86, చిత్తూరు అర్బన్ 55, చిత్తూరు రూరల్ 44, మదనపల్లె 68, పీలేరు 29, పుంగనూరు పరిధిలో 87 కేసులు నమోదు చేశారు. అలాగే విద్యుత్ అదనపు లోడ్ కేసులు 487, చౌర్యం కేసులు 57 మొత్తం 544 సర్వీసులపై కేసులు నమోదు చేశారు. రూ.12.62 లక్షలు జరిమానా విధించి, ఆ రుసుం చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు.

ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులైన బీసీ, ఎస్టీ కులాలకు చెందిన అభ్యర్థులు జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆయా శాఖల అధికారులు రబ్బానిబాషా, మూర్తి కోరారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ యాపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత పొందిన వారికి ప్రోత్సాహకంగా ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. బీసీ, ఎస్టీ కులానికి చెందిన అభ్యర్థులకు అర్హత మేరకు ప్రిలిమ్స్ పరీక్షల్లో అర్హత పొంది ఉంటే రూ.లక్ష, మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.50 వేలు నగదు ప్రోత్సాహం అందిస్తారన్నారు. ఈ ఏడాదిలో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత పొందిన జిల్లాలోని ఎస్టీ, బీసీ అభ్యర్థులు www.jnanabhumi.ap.gov.in పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని వారు కోరారు.

చిత్తూరులో మోస్తరు వర్షం

చిత్తూరు రూరల్: నగరంతోపాటు మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచే ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం రాత్రి వరకు అడపాదడపా కురుస్తూనే ఉంది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

అయోమయం.. గందరగోళం



- తిరుపతి, చిత్తూరు నుంచి పోటీ చేస్తామంటున్న జనసేన
- అభ్యర్థి లేరు.. చిత్తూరులో పోటీచేసుకోండి అంటున్న టీడీపీ
- శ్రీకాళహస్తిలో బీజేపీ, జనసేన, టీడీపీ మూడుముక్కలాట
- బలం లేకపోయినా ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్న వైనం

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ, జనసేన గందరగోళంలో పడ్డాయి. ప్రజాబలం లేకపోవడం, మరో వైపు అభ్యర్థుల కొరత ఆ రెండు పార్టీలను పట్టిపీడిస్తున్నాయి. నోటాకు వచ్చే ఓట్లు కూడా రాని బీజేపీ శ్రీకాళహస్తిపై ఆశలు పెట్టుకుంది. టీడీపీ–జనసేన పొత్తు ఉంటుందని పవన్ కల్యాణ్ ప్రకటించడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆ రెండు పార్టీల శ్రేణులు అధికారంలోకి వచ్చేసినట్లు ఎవరికి వారు సీట్లు ప్రకటించుకుంటున్నారు. అందులో భాగంగా తిరుపతి నుంచి జనసేన అభ్యర్థి తామేనంటూ పసుపులేటి హరిప్రసాద్, మరో వైపు కిరణ్‌రాయల్ ప్రకటించుకుంటున్నారు. లేదు లేదు తామే పోటీలో ఉన్నామంటూ టీడీపీ చెప్పుకుంటోంది. ఈ పరిస్థితుల్లో టీడీపీ, జనసేనకు చెందిన కొందరు ఓ ఒప్పందానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. పవన్ లేదా నాగబాబు పోటీ చేస్తే తాము తిరుపతి టికెట్‌ని త్యాగం చేస్తామని కొందరు టీడీపీ శ్రేణులు హామీ ఇచ్చినట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ వర్గీయులు మాత్రం ససేమిరా అంటున్నారు. ఇన్నేళ్లు పార్టీని నమ్ముకుని, పార్టీ కోసం కష్టపడుతుంటే, పొత్తంటూ వచ్చి తిరుపతి టికెట్ తన్నుకెళ్తామంటే ఒప్పుకునేది లేదని భీష్మించుకున్నారు. వీరిద్దరూ కాకుండా మరో ఇద్దరు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది.

చిత్తూరు తీసుకోండి

చిత్తూరులో టీడీపీని నమ్ముకుని ఉన్న మాజీ మేయర్ కఠారి హేమలత, గీర్వాణి చంద్రప్రకాష్‌ను ప్రస్తావించకుండా ఆ పార్టీ అధినాయకులు జనసేనకు ఆఫర్ ఇచ్చారు. చిత్తూరులో బలమైన అభ్యర్థులు లేరని, కావాలంటే జనసేన నుంచి ఎవరైనా పోటీచేస్తే తాము మద్దతు ఇస్తామని టీడీపీ అధినాయకత్వం చెప్పినట్లు సమాచారం. అయితే టీడీపీలోని కొందరు తమను సంప్రదించకుండా జనసేనకు ఎలా మాట ఇస్తారని తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిసింది. అధిష్టానం ఏదైనా ఆదేశిస్తే ముందుండి చేసేది మేమైతే.. పొత్తంటూ జనసేనకు ఇవ్వడం ఎంత వరకు న్యాయం అని ఆ వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అభ్యర్థులు, ప్రజాబలం లేని జనసేన పార్టీ గంగాధరనెల్లూరు, సత్యవేడు నుంచి కూడా పోటీ చేయనున్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఎవరినీ సంప్రదించకుండా జనసేన వారు లేని పోని ప్రచారాలు చేస్తూ గందరగోళానికి గురిచేస్తున్నారంటూ టీడీపీ నేతలు మండిపడుతున్నారు

శ్రీకాళహస్తిలో మూడు ముక్కలాట

నోటాకు వచ్చే ఓట్లు కూడా రాని బీజేపీ శ్రీకాళహస్తి నుంచి పోటీ చేయాలని స్థానిక నాయకులు భావిస్తున్నారు. అందులో భాగంగా తానే అభ్యర్థి అని కోలా ఆనంద్ చెప్పుకుంటున్నారు. తాము పోటీ చేస్తాను కాబట్టి జనసేన శ్రేణులు తమకే మద్దతు ఇవ్వాలని కమలనాథులు కోరుతున్నారు. అదెలా కుదురుతుంది, తామే పోటీచేస్తామంటూ జనసేన అంటోంది. ఈ రెండు పార్టీలు ఇలా ఉంటే, పొత్తులో భాగంగా జనసేన టీడీపీకి మద్దతు ఇస్తుందని బొజ్జల సుధీర్‌రెడ్డి, మరో వైపు ఎస్సీవీ నాయుడు ప్రచారం చేసుకుంటున్నారు. బీజేపీతో పొత్తు ఉన్నా లేకపోయినా, శ్రీకాళహస్తి కమలనాథులు తమకే మద్దతు ఇస్తారని చెప్పడం గమనార్హం. తెలంగాణాలో బీజేపీ జనసేన పొత్తు పెట్టుకుంటే, ఏపీలో జనసేన టీడీపీతో పొత్తు ఉంటుందని ప్రకటించింది. టీడీపీ మాత్రం ఎన్నికల బరి నుంచి తప్పుకుని కాంగ్రెస్‌కు మేలు చేసేందుకు పరోక్షంగా మద్దతు ఇస్తోంది. 2019 ఎన్నికల్లో ఒకే సీటుతో సరిపెట్టుకున్న టీడీపీ, ఉనికే లేని జనసేన, నోటా ఓట్లు కూడా రాని బీజేపీ ఎవరికి వారు తాము పోటీ చేస్తున్నాం అంటూ ప్రచారం చేసుకుంటుంటే జనం నవ్వుకుంటున్నారు. అధికారం కోసం ఇంతగా దిగజారటం ఏంటో ఇటు ఓటర్లూ, అటూ రాజకీయ పార్టీలు అయోమయంలో మునిగిపోయారు.

పకడ్బందీగా ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు



ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శనివారం ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను పకడ్బందీగా నిర్వహించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్న 1,762 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. చిత్తూరు రూరల్ మండలం మాపాక్షి, తుమ్మింద పోలింగ్ కేంద్రాలను డీఆర్వో రాజశేఖర్ పరిశీలించారు. ఆ పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి, బీఎల్వోలకు సూచనలిచ్చారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి, ఏప్రిల్ ఒకటి, అక్టోబర్ ఒకటి నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఈ ఏడాది డిసెంబర్ 9వ తేదీ లోగా ఫారం–6 కింద ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే ఆయా రెవెన్యూ డివిజన్లలో ఆర్డీఓలు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఆదివారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల శిబిరం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించుకుని ఏవైనా తప్పిదాలు ఉంటే సవరణ చేసుకునేలా ఓటర్లు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు.

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పాత్రికేయులు

చిత్తూరు రూరల్: సుదీర్ఘకాలం పాటు ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై చిత్తూరు పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం చిత్తూరులోని ప్రెస్‌క్లబ్‌లో ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే), చిత్తూరు ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్, చిత్తూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లోకనాథన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని చిత్తూరుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన సందర్భంగా తొలుత వినతి పత్రం అందజేశామన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ పెద్దలు, జర్నలిస్టులు ఈ విషయమై వినతిపత్రాలు అందజేశారన్నారు. దీనిపై స్పందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాల మంజూరుకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారన్నారు. చిత్తూరు ప్రెస్ క్లబ్ కార్యదర్శి అశోక్‌కుమార్ మాట్లాడుతూ సీఎం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని జర్నలిస్టు యూనియన్లు ఎప్పటికీ మరిచిపోవన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కోశాధికారి పవన్ కుమార్, కార్యవర్గ సభ్యులు ప్రదీప్, అయ్యప్ప నాయుడు, చంద్రశేఖర్, శివ, సీనియర్ పాత్రికేయులు వీర రాఘవులు, శివకుమార్, బాలసుందరం, రాజేష్, హరీష్, వరదరాజులు, సురేష్, కృపానందరెడ్డి, శ్రీనివాసులు, చిరంజీవి, కృష్ణ సింగ్, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- గత ప్రభుత్వంలో కుదేలైన నేత పరిశ్రమ
- జగనన్న సారథ్యంలోనే నేతన్నలకు మేలు
- పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: రాష్ట్రంలోని నేతన్నల సంక్షేమమే లక్ష్యంగా నేటి జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గత చంద్రబాబు పాలనలో కుదేలైన నేత పరిశ్రమను గాడిలో పెట్టిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. శనివారం సాయంత్రం పుత్తూరు మున్సిపాలిటీ తొమ్మిదో వార్డు గోవిందపాళెం సచివాలయం పరిధిలోని శీలకారువీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. అవ్వా పింఛన్ అందిందా? అక్కా చేయూత వచ్చిందా? ఆరోగ్యశ్రీ పథకం ఆదుకునిందా? అమ్మఒడి చదువు చెబుతోందా? అంటూ ఆరా తీశారు. అందరూ అన్నీ అందుతున్నాయని సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ కుల, మత, పార్టీలకతీతంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని అన్నారు. ఎన్నికల సందర్భంగా జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టోలోని హామీలు 99 శాతం నెరవేర్చినట్లు చెప్పారు. నేడు అవినీతికి తావులేకుండా వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు ఇంటి గుమ్మం వద్దకే వస్తున్నాయని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరుతోందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల ప్రత్యేక నిధులు అందుతున్నాయని తెలిపారు. ఈ నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఇలా ప్రతి ఇంటా సంక్షేమం అందిస్తూ మహాత్మా గాంధీ కన్న కలలను సాకారం చేస్తున్న ఘనత మన జగనన్నకే దక్కిందన్నారు. అవినీతిలో కూరుకు పోయి జైలు పాలైన చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. ఎన్నికల సమయంలో పలు హామీలు గుప్పించే చంద్రబాబునాయుడు, తర్వాత ప్రజలను మోసం చేయడం ఆయన నైజమన్నారు. జగనన్న ఇచ్చిన హామీలనే కాకుండా, చెప్పని పలు కార్యక్రమాలను సైతం చేశారని ఇదీ వైఎస్సార్ కుటుంబ నైజమన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఇందుకు ప్రజలందరూ ఆయన్ని ఆశీర్వదించాలని కోరారు. తనను నగరి ఎమ్మెల్యేగా మూడోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలియార్, కౌన్సిలర్లు ఏకాంబరం, పవన్‌కుమార్, చిట్టిబాబు, సింగిల్‌విండో అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, లారీమోహన్, మనోహర్‌రెడ్డి, జయచంద్ర, లత, తిరునావక్కరసు, గోపి, జయబాబు, మునిరత్నం, చిన్న, ఈశ్వరయ్యయాదవ్, మోహన్‌రెడ్డి, చిరంజీవి, ఏకాంబరం, తదితరులు పాల్గొన్నారు.



బాలామృతం పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

పేకాట ఆడుతూ పట్టుబడ్డ టీడీపీ కౌన్సిలర్



టీడీపీ కౌన్సిలర్ కస్తూరి, ఆమె భర్త వేలు, నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

కుప్పం: పేకాట ఆడుతూ టీడీపీ కౌన్సిలర్ పట్టుబడిన ఘటన కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. కుప్పం సీఐ శ్రీధర్ కథనం.. అర్బన్ కాలనీలో టీడీపీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ కస్తూరి ఇంట్లో పేకాట నడుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడ పేకాట నిర్వహిస్తున్న టీడీపీ కౌన్సిలర్ కస్తూరితో పాటు పేకాట ఆడుతున్న ఆమె భర్త వేలు, ప్రదీప్, ప్రతాప్, చక్రవర్తి, శ్రీధర్, నాగేంద్ర, మంజునాథ్, కనకరాజును అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 8 ద్విచక్ర వాహనాలు, 9 మొబైల్ ఫోన్లు, రూ.37,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. కుప్పం పట్టణానికి చెందిన ఉమాపతినాయుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా కౌన్సిలర్ భర్త వేలు పేకాట ఆడుతూ గతంలో రెండు, మూడు సార్లు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ దాడుల్లో ఎస్ఐ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుని సేవలో లోకాయుక్త చైర్మన్



జస్టిస్ లక్ష్మణరెడ్డికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారిని లోకాయుక్త చైర్మన్ జస్టిస్ లక్ష్మణరెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఉదయం ఆయన స్వామివారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి విచ్చేయగా ఈఓ వెంకటేశు ఆయనకు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, ఎస్ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి


కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

యాదమరి: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నటరాజన్ శనివారం దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆయన స్వామి వారి దర్శనార్థం కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి వారికి స్వాగతం పలికి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, చిత్తూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నగరి : ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14, 17 బాల, బాలికల క్యారమ్స్, అండర్–14 బాల బాలికల కబడ్డీ పోటీలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ ఫెడరేషన్ కార్యదర్శులు సురేష్‌బాబు, బాబు, వసంత, విజయలక్ష్మి తెలిపారు. క్యారమ్స్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ఈ నెల 7వ తేదీన విజయం ది స్కూల్ చిత్తూరు, కబడ్డీ క్రీడాకారుల ఎంపికకు ఈ నెల 11వ తేదీన చౌడేపల్లె మండలం, పుదిపట్ల జెడ్పీ హైస్కూలులో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలకు విచ్చేసే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, చైల్డ్ ఐడీ, జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డ్ వెంట తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు క్యారమ్స్‌కు సంబంధించి పీడీ మేరాల శరత్ 8639389796ను, కబడ్డీకి ఎస్‌ఏ పీఈలు వెంకటేశ్వర్లు 6301610485, రామచంద్ర 9110565490 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పవిత్రం.. శాస్త్రోక్తం

- వేడుకగా నాలుగు, ఐదో కాల పూజలు


పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు


కలశ పూజలు చేసి, స్వామివారికి హారతులిస్తున్న అర్చకులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు నాల్గొవ, ఐదో కాల పూజలు వేడుకగా నిర్వహించారు. ఉదయం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు కుటుంబ సభ్యులతో కలసి స్వామివారికి పూజా సామగ్రిని ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ అర్చకులకు అందజేశారు. వారు అలంకార మండపంలో ఏర్పాటు చేసిన కలశం వద్ద హోమాలు, యజ్ఞాలు నిర్వహించి, కాలపూజ, వ్రత సమర్పణ, లఘు పూర్ణాహుతి, నీరాజనం, మంత్ర పుష్పాలు సమర్పించారు. సాయంత్రం మంత్ర పుష్పం సమర్పించి, పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఐరాల విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

ఐరాల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్–19 ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరచి, పతకాలు సాధించారని శనివారం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో జరిగిన అండర్–19 రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ టీమ్ ఈవెంట్‌లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని మొగిలీశ్వరి విశేష ప్రతిభ కనబరచి, బంగారు పతకం, మరో ముగ్గురు విద్యార్థులు జాహ్నవి, రేవతి, మహేష్ వెండి పతకాలు సాధించారన్నారు. పీడీ దేవ, క్రీడాకారులను పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, ఖేలో- ఇండియా ఫెన్సింగ్ కోచ్ కార్తీక్, టీచర్లు అభినందించారు.

జాబ్‌మేళాలో 267 ఉద్యోగాలు

పలమనేరు: పట్టణంలోని శ్రీవాణి, శ్రీపద్మావతి కళాశాలల వద్ద ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 267 మందికి ఉద్యోగాలు లభించినట్టు ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా కోఆర్డినేటర్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు పలు రాష్ట్రాలకు చెందిన ఆపోలో ఫార్మసీ, కాగ్నెట్, అమరరాజ, ఇన్నోవ్‌సోర్స్, ఏపీఎస్‌ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్, మెడ్ ప్లస్, ఈకాం ఎక్స్‌ప్రెస్, భారతి ఫైనాన్స్, ఆస్టోటెక్ ఇండియా తదితర 20 కంపెనీల ప్రతినిధులు హాజరై, నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ శిబిరానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 478 మంది అభ్యర్థులు హాజరు కాగా వీరిలో 267 మందికి ఉద్యోగాలు లభించాయి. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.30 వేల దాకా వేతనాలుంటాయని నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగాలు సంపాదించిన వారిని కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి రెడ్డి, కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ జాబ్ మేళాను స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి గోపీకృష్ణ, మాజీ కన్వీనర్ మండీ సుధ, ఏరియా ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి, చంద్రప్ప, శ్రీరాములు రెడ్డి పాల్గొన్నారు.

ఇనుము దొంగల అరెస్టు

పలమనేరు: డైరీలో విద్యుత్ ఇనుప స్తంభాలను చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. తమ డైరీలో రూ.50 వేలు విలువ చేసే 430 కిలోల ఇనుప కరెంట్ స్తంభాలు చోరీ అయినట్టు రెండ్రోజుల క్రితం కిరణ్‌కుమార్ అనే వ్యక్తి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టిన పోలీసులు పట్టణంలో ఆటోలో ఇనుము తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. రాధాబంగ్లాకు చెందిన దిల్‌షాద్ (32), గంటావూరుకు చెందిన ఇర్షాద్(30) ఆటోడ్రైవర్లు సులువుగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడి, ఇనుము చోరీలకు పాల్పడుతున్నట్టు తేలింది. దీంతో నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట


పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

పలమనేరు: పట్టణానికి చెందిన ఓ ప్రేమజంట తమకు కుటుంబసభ్యుల నుంచి ప్రాణహాని ఉందంటూ స్థానిక పోలీసులను శనివారం ఆశ్రయించారు. ప్రేమికుల జంట కథనం మేరకు.. పట్టణంలోని కొత్తపేటకు చెందిన సుజిత, గాంధీనగర్‌కు చెందిన మహేష్ కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. సుజితకు మైనారిటీ తీరకపోవడంతో ఇన్నాళ్లు ఓపిగ్గా ఉన్న ప్రియుడు ఇటీవల ఆమెకు మైనర్ తీరడంతో కర్ణాటకకు తీసుకువెళ్లి, అక్కడ పెళ్లి చేసుకుని, తిరిగి వచ్చి స్థానిక పోలీసులను ఆశ్రయించారు. అయితే బాలిక మిస్సింగ్, కిడ్నాప్ కేసులు కర్ణాటక రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్నందున స్థానిక సీఐ చంద్రశేఖర్ వారిని అక్కడికి పంపారు.

ఇద్దరు పిల్లలు, వివాహిత అదృశ్యం

చిత్తూరు అర్బన్: నగరానికి చెందిన వివాహిత రేవతి తన ఇద్దరు పిల్లలతో కనిపించకుండాపోయింది. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. నగరంలోని రెడ్డిగుంటకు చెందిన రామాంజులుకు చిత్తూరు మండలం ఎన్‌ఆర్.పేటకు చెందిన రేవతి(34)ని పెళ్లి చేసుకున్నాడు. వారికి గాయత్రి (12), మీన (7) పిల్లలున్నారు. వీరు కొంగారెడ్డిపల్లెలోని భాస్కర హోటల్‌లో పని చేస్తున్నారు. ఇటీవల భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భర్తపై అలిగిన రేవతి తన ఇద్దరు పిల్లల్ని తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. పలుచోట్ల వెతికినా వారి ఆచూకీ లేకపోవడంతో రామాంజులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి ఆచూకీ తెలిసిన వారు 944796707, 9440796705 కుగాని, డయల్–100కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ట్రావెల్స్ బస్సు, ఐషర్ ఢీ

పలువురికి గాయాలు


సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే

వి.కోట: ట్రావెల్స్ బస్సు, ఐషర్ వాహనం ఢీ కొని పలువురు కూలీలు గాయపడిన సంఘటన మండలంలోని పలమనేరు–వి.కోట జాతీయ రహదారి కుమ్మరమడుగు గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. ఒడిశా నుంచి పలువురు కూలీలు కేరళకు వి.కోట మీదుగా ట్రావెల్స్ బస్సులో వెళుతున్నారు. వి.కోట నుంచి వెళుతున్న ఐషర్ వాహనం కుమ్మరమడుగు క్రాస్ వద్ద వర్షం కురుస్తుండడంతో వేగంగా వచ్చి ప్రమాదవశాత్తు బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో 15 మంది గాయపడ్డారు. బస్సులో ప్రయాణిస్తున్న వలస కూలీల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వి.కోట ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుప్పం పీఈఎస్‌కు తరలించారు. మండలంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ కుమ్మరమడుగు వద్ద జరిగిన ప్రమాదాన్ని తెలుసుకుని, అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు.

కన్న కూతురిపైనే లైంగిక దాడి

పుంగనూరు: సభ్యసమాజం తలదించుకునేలా కన్న కూతురిపైనే ఓ తండ్రి లైంగికదాడికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి పుంగనూరులో చోటుచేసుకుంది. సీఐ కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. తల్లి టైలర్. వీరి కుమార్తె పదోతరగతి చదువుతోంది. ఇలా ఉండగా బాలిక స్కూల్ ముగిసిన తరువాత ఇంటికి వెళ్లడంతో ఇంట్లోనే ఉన్న తండ్రి కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో ఇరుగుపొరుగువారు వచ్చి బాలికను కాపాడి, తల్లికి సమాచారం అందజేశారు. తల్లి ఇంటికి చేరుకుని కుమార్తెను తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. కాగా గతంలో కూడా అతడు లైంగికదాడికి పాల్పడినట్లు బాధిత బాలిక పేర్కొంది. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నట్లు తెలిసింది. బాలిక ఫిర్యాదు మేరకు సీఐ రాఘవరెడ్డి కేసు నమోదు చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.

మద్యం కేసులో ఒకరి అరెస్టు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న వి.జగన్నాథం (55)ను చిత్తూరు రూరల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పోలీసులు శనివారం అరెస్టు చేశారు. బంగారుపాళెం మండలం కీరమందలో సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్‌ఈబీ సిబ్బంది తనిఖీలు చేశారు. ఆ సమయంలో టేకుమందకు వెళ్లే దారిలో వి.జగన్నాథం, కిరణ్ ద్విచక్రవాహనంలో ఓ సంచి తీసుకెళుతుండగా పోలీసులు తనిఖీలు చేశారు. వాహనం నడుపుతున్న కిరణ్ అనే వ్యక్తి పారిపోగా, మద్యం సంచి పట్టుకున్న జగన్నాథంను పోలీసులు అదుపులోకి తీసుకుని, తనిఖీ చేయగా 192 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి, అతడిని అరెస్టు చేశారు. మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. పారిపోయిన కిరణ్‌పై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం గౌడ్, వెంకటేష్, కిరణ్ కుమార్, రేఖ, మమత, చంద్రకళ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి


రాజేంద్రరెడ్డి (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లె వద్ద చెన్నై–బెంగళూరు హైవే రోడ్డుపై శనివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ బాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జంబువారిపల్లె పంచాయతీ మాధవనగర్‌లో నివాస ముంటున్న రాజేంద్రరెడ్డి(72) టీ తాగేందుకు తిమ్మోజుపల్లె క్రాస్ వద్దకు వెళ్లాడు. టీ తాగి దుకాణం నుంచి తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పలమనేరు వైపు నుంచి చితూరు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో రాజేంద్రరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చెప్పారు.

ఆటో, కారు ఢీ.. వ్యక్తి దుర్మరణం

చిత్తూరు అర్బన్: నగరంలో శనివారం ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నగరానికి చెందిన ఉదయ్‌కుమార్ అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను శుక్రవారం ఆటోలో వళ్లియప్పనగర్‌కు చెందిన బి.రఘు(56), ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనివాసులు ఆచ్చారి, సలీం అనే ప్రయాణికులను తన ఆటోలో ఎక్కించుకుని నగరంలోని బెంగళూరు రోడ్డులో ప్రశాంత్‌నగర్ వైపు బయలుదేరాడు. జాతీయ రహదారిపై ఎదురుగా అతివేగంగా వచ్చిన ఓ కారు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రఘును చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆటో డ్రైవర్ ఉదయ్, శ్రీనివాసులు ఆచ్చారి, సలీం గాయపడి, చికిత్స పొందుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.